జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com


# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక


చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 03-09-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 773 పేజీలు: 4 వెల : రూ.7

# వైఎస్‌ఆర్‌కు ఘన నివాళి

✳ పేదల పెన్నిధి రాజశేఖరరెడ్డి ✳ మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు ✳ వైఎస్.. సంక్షేమ ప్రదాత ✳ మాజీ మంత్రి కృష్ణదాస్ ✳ జిల్లా వ్యాప్తంగా వైఎస్ వర్ధంతి ✳ పలాసలో సీదిరి అప్పలరాజు, ఆమదాలవలసలో చింతాడ రవి, టెక్కలిలో పేరాడ తిలక్, ఇచ్ఛాపురంలో శ్యాంప్రసాద్‌రెడ్డి, పాతపట్నంలో రెడ్డి శాంతి ఆధ్వర్యంలో వైఎస్‌ఆర్ వర్ధంతి









శ్రీకాకుళం, సెప్టెంబర్ 2 (వార్త): జిల్లావ్యాప్తంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని బుధవారం నిర్వహించారు. వైఎస్ విగ్రహాలకు, చిత్రపటాలకు ఆ పార్టీ వైసీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్రానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. శ్రీకాకుళం నగరంలోని వైసీపీ కార్యాలయంలో వైఎస్‌ఆర్ విగ్రహానికి మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాస్ తదితర నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ ఐదున్నరేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన తనకంటు ఒక ముద్రను వేసుకున్నారన్నారు. ప్రజలను ప్రేమించడంలో, సమాజం పట్ల బాధ్యతగా ఉండటంలో, సమాజంలో ఉండే అంతరాలను తగ్గించడంలో, ఏ విధానం అమలు చేస్తే పేదరికం పోయి అందరూ ఉత్సాహంగా జీవిస్తారో ఆ దిశగా పనిచేయడంలో, ప్రజల్లో ఉన్న నిస్పృహను పోగొట్టడంలో సంవత్సరాల పాటు కృషి చేసిన మహానుభావుడు వైయస్ రాజశేఖర్ రెడ్డి అని తెలిపారు. 104,108, ఆరోగ్యశ్రీ, పేదలకు ఇళ్లు, భూమి తదితర సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఎస్టేట్ అబాలిష్‌మెంట్, ఇనాం అబాలిష్‌మెంట్ వంటి భూస్వామ్య వ్యవస్థలను రద్దు చేసే పెద్ద చట్టాలను తీసుకొచ్చారన్నారు. ఒకటిన్నర లక్షల ఎకరాల భూమిని ఆదివాసీలకు, దాదాపు తొమ్మిది లక్షల ఎకరాల భూమిని నిరుపేదలకు ఆయన హయాంలో పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఆయన అడుగుజాడల్లోనూ కుమారుడు జగన్మోహనరెడ్డి నడుస్తున్నారన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గంలోనే 20 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చామన్నారు. వారు మనకు ఓటు వేయకపోవచ్చు. కానీ వారికి మనం సొంత ఇల్లు కల్పించామన్నారు. రెండున్నరేళ్ల కూటమి పాలనలో ఒక్క పేద వాడికైనా ఒక్క సెంటు భూమినైనా ఇళ్ల స్థలాల కోసం కొనుగోలు చేసి ఇచ్చిందా అని ప్రశ్నించారు. లోకేష్ మాత్రం 99 పైసలు ఏంటి, 50 పైసలకు కూడా కార్పోరేట్ కంపెనీలకు ఇచ్చేస్తానని అహంకారంతో చెబుతున్నాడన్నారు. అధికారంలోకి వచ్చిన వారు ఐదేళ్లకు ట్రస్టీల లాంటివారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పుడు ప్రజల ఆస్తులకు కాపలాదారులుగా ఉండాలి. ఈ ఆస్తులను ప్రజల అవసరాల కోసం కాపాడాలి. ప్రజల మధ్య ఉన్న వ్యత్యాసాలను తగ్గించడానికి ప్రయత్నిస్తూ ఉండాలి.రాజ్యాంగంలో చెప్పినట్టుగా, సంపద అందరికీ సమానంగా అందేలా ప్రభుత్వాలు పనిచేయాలి. రాజ్యాంగం నిర్దేశించిన మార్గదర్శక సూత్రాల ప్రకారం పనిచేయాలి.కానీ లోకేష్ చెబుతున్న విధానంలో రాష్ట్ర ప్రజల ఆస్తులను పెద్దపెద్దకంపెనీలకు ఇలా పంచిపెడతామని అంటున్నారని, ప్రజలు ఒక్క క్షణం ఆలోచించాలని కోరారు. రాజశేఖర్ రెడ్డి నమ్మిన సిద్ధాంతం ఏమిటంటే.. విద్య ఒక్కటే సమాజంలో ఉన్న ఆర్థిక, విద్యా, సామాజిక వ్యత్యాసాలను తొలగించగల ఆయుధం అని ఆయన నమ్మారు.ఆ నమ్మకంతోనే క్యాబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటు చేశారు. అందులో నేను కూడా ఒక సభ్యుడిని. మేము ఒక ప్రతిపాదన ఇచ్చాం. ఈ రాష్ట్రంలో ఉండే ఏ పేద పిల్లవాడికైనా తన ఆర్థిక పరిస్థితి ఉన్నత విద్య చదవడానికి ఆటంకం కాకూడదని, అతను ఉన్నత విద్య చదివేందుకు అయ్యే ఖర్చును ప్రభుత్వం చెల్లిస్తే బాగుంటుందని మేము నివేదిక ఇచ్చాం. ఆ నివేదికను ఆయన అమలు చేశారన్నారు. చంద్రబాబు హయాంలో ఏం జరుగుతోంది? ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఐస్‌కత్తితో పొడిచేశారు. ప్రైవేట్ కాలేజీలను ఇష్టానుసారంగా నెలకొల్పారు. కాలేజీల క్షేమం పేరుతో ఫీజులు పెంచేసి దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ప్రస్తుతం శ్రీకాకుళం హెడ్‌క్వార్టర్స్‌లో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో జ్వరానికి మందులు కూడా లేని పరిస్థితి. జ్వరం వచ్చినా ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి రూ.50 వేల వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. రాజశేఖర్ రెడ్డి గారి కార్యక్రమాలను అమలు చేయడానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పుట్టింది. ఆ పునాదుల మీదే ఈ పార్టీ నడుస్తోందన్నారు. ప్రస్తుతం "జగన్మోహన్ రెడ్డి రావాలి" అనే నినాదం ప్రజల్లో బలంగా వినిపిస్తోందన్నారు. నాకు, దాస్ అన్నయ్యకు మంచి స్థానం కల్పించి, జిల్లా ప్రజలకు మంచి కార్యక్రమాలు చేయడానికి మాపై విశ్వాసం ఉంచారు. టికెట్ ఇచ్చినా, ఇవ్వకపోయినా.. మంత్రిగా తీసుకున్నా, తీసుకోకపోయినా.. నా శక్తి ఉన్నంతవరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే ఉంటా.. వైయస్సార్ కుటుంబంతోనే ఉంటానని ప్రసాదరావు అన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ వైఎస్‌ఆర్ సంక్షేమ ప్రదాత అని, అన్ని వర్గాల గుండెల్లో చిరస్మరణీయంగా ఉన్నారన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ముందుకుసాగుతున్నామన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జనసేన అధినేత పవన్.. ఓ ప్రభంజనం

✳ యువత గుండెల్లో ధైర్యం నింపిన నాయకుడు ✳ జనసేన నాయకులు డాక్టర్ దానేటి శ్రీధర్ ✳ ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు ✳ నగరంలోని వేలాది జనసైనికులతో భారీ బైక్ ర్యాలీ









శ్రీకాకుళం, సెప్టెంబర్ 2 (వార్త): రాజకీయాల్లోనూ, సినిమాల్లోనూ పవన్ కళ్యాణ్ ఓ ప్రభంజనమని జనసేన నాయకులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. జనసేన పార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలను జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ ఆధ్వర్యంలో బుధవారం శ్రీకాకుళం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. శ్రీకాకుళం నగరంలో డేఅండ్ నైట్ నుంచి ఏడు రోడ్లు జంక్షన్, సూర్యమహల్ మీదుగా 80 అడుగుల రోడ్డులోని ఆనందమయి ఫంక్షన్ హాలు వరకు వేలాది మంది యువత, జనసేన నాయకులు, కార్యకర్తలతో బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ దానేటి శ్రీధర్ మాట్లాడుతూ లక్ష్యం ఉన్నవాడు ఆగకూడదని, ఆశయం ఉన్నవాడు తగ్గకూడదని పవన్ కళ్యాణ్ రాజకీయ ప్రయాణం యువతకు చెప్పే గొప్ప సందేశమని పేర్కొన్నారు. ఓడిపోయినా నిలబడాలి...పడిపోయినా లేవాలి...ఎన్ని అడ్డంకులు వచ్చినా ముందుకు నడవాలి అన్న స్ఫూర్తిని యువతలో రగిల్చిన గొప్ప పోరాటయోధుడు పవన్ కళ్యాణ్ అని కొనియాడారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, ఫారెస్ట్ అథారిటీ డవలప్ మెంట్ డైరక్టర్ గేదెల చైతన్య, నియోజకవర్గ నాయకులు కోరాడ సర్వేశ్వరరావులు మాట్లాడుతూ ఓటముల నుంచి వచ్చిన పాఠాలను పవన్ కళ్యాణ్ విజయాలుగా మలుచుకున్నారన్నారు. సేవా గుణం.. బాధితుల పక్షాన వెంటనే స్పందించడం.. వంటి లక్షణాలు ఆయనను రాజకీయాల్లో విలక్షణమైన వ్యక్తిగా తీర్చిదిద్దాయన్నారు. పరిపాలనపరంగా యంత్రాంగాన్ని తిట్టకుండా, కేవలం స్వేచ్ఛాయుత విధానంలోనే పనిచేయిస్తున్నారు. ఇది ఒక రకంగా ఆయన మార్పు చూపించే ప్రయత్నమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ అథారిటీ డవలప్‌మెంట్ డైరక్టర్ గేదెల చైతన్య, జనసేన నాయకులు గురు ప్రసాద్, రావాడ కామేష్, కొండ ఉదయ్, నవీన్, కాకర్ల ప్రదీప్, బి.శంకర్, బడి శ్రీరాములు, సత్యవతి, మోహనలక్ష్మి, విష్ణుప్రియ, సుశీల, వేల సంఖ్యలో జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# ఐక్య పోరాటాలతోనే కార్మిక హక్కుల సాధన

- మడపాం టోల్‌ప్లాజా వద్ద సీఐటీయూ జెండా ఆవిష్కరణ
- కార్మికుల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పోరాడాలని పిలుపు
- సీఐటీయూను బలోపేతం చేయాలి
- రాష్ట్ర కార్యదర్శి తేజేశ్వరరావు



**నరసన్నపేట, సెప్టెంబరు 2 (వార్త):** ఐక్య పోరాటాల ద్వారానే కార్మికులు తమ హక్కులను సాధించుకోవడం సాధ్యమవుతుందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పి. తేజేశ్వరరావు అన్నారు. నరసన్నపేట మండలం మడపాం టోల్‌ప్లాజా వద్ద స్థానిక ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తేజేశ్వరరావు మాట్లాడుతూ కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘటిత శక్తి ఎంతో అవసరమన్నారు. ఐక్యతతో కూడిన పోరాటాల ద్వారా మాత్రమే కార్మికుల హక్కులను కాపాడుకోవడంతో పాటు మెరుగైన పని పరిస్థితులు, న్యాయమైన వేతనాలు సాధించుకోవచ్చని పేర్కొన్నారు. 1970లో అతి కొద్ది మంది సభ్యులతో ప్రారంభమైన సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) నేడు కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా పనిచేస్తున్న ప్రముఖ కార్మిక సంఘంగా ఎదిగిందన్నారు. ఎన్నో ఉద్యమాలు, పోరాటాల ద్వారా కార్మికుల సమస్యలను ప్రభుత్వాలు, యాజమాన్యాల దృష్టికి తీసుకెళ్లడంలో సీఐటీయూ కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. సామాన్య కార్మికుల శ్రమపై ఆధారపడి పెట్టుబడిదారుల వ్యవస్థ కొనసాగుతోందని, కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు, ప్రతిఫలం లభించేందుకు నిరంతరం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులకు అన్ని వేళలా అండగా నిలిచే సీఐటీయూ వంటి సంఘాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. 'ఐక్యత-- పోరాటం' అనే నినాదంతో కార్మికులు ముందుకు సాగాలని, వ్యక్తిగత ప్రయోజనాల కంటే సమష్టి ప్రయోజనాల కోసం సంఘటితంగా పనిచేయాలని సూచించారు. మడపాం టోల్‌ప్లాజా ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు కార్యక్రమంలో పాల్గొని కార్మిక సంఘీభావాన్ని ప్రదర్శించారు.

## తెలగగంగువాడ పాఠశాలకు 10 కుర్చీల వితరణ



**మందస, సెప్టెంబరు 2(వార్త):** విద్యార్థుల సంక్షేమం, పాఠశాల అభివృద్ధి పట్ల తనకున్న నిబద్ధతను చాటుతూ చిత్త కూర్మారావు సేవా దృక్పథంతో ముందడుగు వేశారు. మందస మండలంలోని రాంపురం పంచాయతీ తెలగగంగువాడ ఎంపీపీ పాఠశాలకు రూ.2,500 విలువ చేసే 10 కుర్చీలను ఆయన విరాళంగా అందజేశారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను గుర్తించి, తన వంతు సహాయంగా కుర్చీలను అందించడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలనే సందేశాన్ని కూర్మారావు ఈ సందర్భంగా చాటిచెప్పారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం చేసే ప్రతి చిన్న సహాయం ఎంతో విలువైనదని, విద్యాసంస్థలకు అండగా నిలవడం సమాజంపై మన బాధ్యత అని ఆయన చూపించిన సేవాభావాన్ని పలువురు అభినందించారు. పాఠశాల అవసరాన్ని గుర్తించి స్పందించి, విద్యార్థుల సౌకర్యం కోసం కుర్చీలను అందించిన చిత్త కూర్మారావు దాతృత్వం అభినందనీయమని పాఠశాల వర్గాలు పేర్కొన్నాయి. ఆయన సేవాభావం మరెందరికో స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.

## జీతాలు చెల్లించాలంటూ ధర్నా



**సంతబొమ్మాళి, సెప్టెంబరు 2(వార్త):** మూలపేట పోర్ట్ లో పనిచేస్తున్న సిబ్బంది జీతాలు చెల్లించాలంటూ బుధవారం ధర్నా చేపట్టారు. మూడు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని అడిగిన ప్రతిసారి కుంటి సాకులు చెబుతున్నారని సిబ్బంది వాపోయారు. విషయం తెలుసుకున్న హెచ్‌ఆర్ మేనేజర్ రాఘవరెడ్డి వచ్చి సిబ్బందితో మాట్లాడారు. మూడు నెలలు జీతాలు ఇవ్వకపోతే మా మీదే ఆధారపడి బతుకుతున్న మా కుటుంబ పరిస్థితి ఏమిటనీ ప్రశ్నించారు. జీతాలు చెల్లించకుండా సిబ్బందిని తొలగిస్తున్నారని ఇది ఎంతవరకు సమంజసమని నిలదీశారు. ముందు మా జీతాలు చెల్లించాలని నినాదాలు చేశారు. యాజమాన్యంతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో సిబ్బంది వెనుతిరిగారు.

## బహడపల్లిలో బదిలీ ఉపాధ్యాయునికి ఘన సన్మానం



**మందస, సెప్టెంబరు 2(వార్త):** బహడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరు సంవత్సరాల పాటు మేథ్స్ ఉపాధ్యాయునిగా పని చేసి పదోన్నతిపై హరిపురం ప్లస్ టు పాఠశాలకు బదిలీపై వెళ్లినటువంటి ఈగల శ్రీనివాసరావును పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ అభివృద్ధి కమిటీ బహడపల్లి గ్రామస్తులు పౌర సన్మానం చేశారు. ఆరు సంవత్సరాల కాలంలో విద్యార్థుల అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడుతూ పలువురు వక్తలు మాట్లాడారు. ప్రధానోపాధ్యాయుడు డోల కేశవరావు, ఎక్స్ ఎంపీటీసీ సభ్యుడు సాలిన పార్వతీ, మాధవరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు సాలిన ఉమాపతి, సాలిన జానకిరావు, సార భాస్కరరావు, ఎస్ఎంసి చైర్మన్ కరగాని వల్లభరావు, గ్రామ పెద్దలు సాలిన వెంకటరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని ఆయన సేవలను కొనియాడారు.

## 4న చిన్నసువర్ణాపురంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**మందస, సెప్టెంబరు 2(వార్త):** సువర్ణాపురం పంచాయతీలోని చిన్నసువర్ణాపురంలో ఈనెల 4న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించడానికి సన్నహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఉట్టికొట్టు.. ప్రైజ్ పట్టు, డాన్స్ పోటీలు నిర్వహించనున్నారు. ఎన్నడూ.. ఎక్కడ లేని విధంగా పోటీల్లో ఓడపోయిన జట్లకు కూడా ప్రోత్సహించనున్నట్టు వారు తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుండి చిన్నసువర్ణపురంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరగబోతున్నాయి. మధ్యాహ్నం 12 గంటల నుండి ఆలయ ఆవరణలో అన్నదానం, మధ్యాహ్నం మూడు గంటల నుండి ఉట్టు కొట్టు ప్రైజ్ పట్టు కార్యక్రమం, రాత్రి 8 గంటలకు డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమం, గ్రూప్ పోటీల్లో ప్రథమ బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.7వేలు, తృతీయ బహుమతి రూ.5వేలు ఇవ్వబడుతుంది. అదేవిధంగా డ్యూయెట్‌లో రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులుగా ఇవ్వబడుతుంది.




### సోలో పోటీల్లో

1వ బహుమతి రూ.3,000, 2వ బహుమతి రూ. 2,000, 3వ బహుమతి రూ.1,000 ఇస్తారు. పోటీల్లో పాల్గొనడానికి ఎంట్రీ ఫీజు లేదు. దూర ప్రాంతాల నుండి వచ్చి పోటీలో పాల్గొన్న వారందరికీ తగిన నగదు పురష్కారం ఇవ్వబడుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాలకు శాంతి నారాయణ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్, ప్రొ.డొక్కరి శాంతి, నారాయణ, కుమారులు వెంకటేష్,, మహేష్(చిన్నసువర్ణపురం) ఆహ్వానిస్తున్నారన్నారు. మరిన్ని వివరాలకు 9666462628, 8074391045, 9381462392 సంప్రదించాలని వారు కోరారు. చిన్నసువర్ణపురం గ్రామానికి చెందిన డొక్కరి నారాయణ, శాంతి దంపతులచే ఈ పూజా కార్యక్రమం మొత్తం నిర్వహించబడుతుంది. సుమారు రెండు లక్షల రూపాయల వ్యయంతో శ్రీకృష్ణాష్టమి పూజా కార్యక్రమాలు, అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

# మా త్యాగాలకు ప్రతిఫలం ఇదేనా?

- ఆలయాలకు స్థలం కేటాయించకపోవడంపై విష్ణుచక్రం గ్రామస్తుల ఆందోళన
- తహసీల్దార్ నిలదీసిన నిర్వాసితులు



**సంతబొమ్మాళి, సెప్టెంబరు 2(వార్త):** మూలపేట పోర్టుకు మా గ్రామాన్ని, భూములను ఇచ్చి త్యాగాలు చేస్తే ప్రతిఫలం ఇదేనా అంటూ నిర్వాసిత గ్రామమైన విష్ణుచక్రం గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. మా గ్రామానికి ఆలయాల స్థల కేటాయింపులో జరిగిన అన్యాయంపై తాసిల్దార్ హేమ సుందరావును విష్ణుచక్రం గ్రామానికి చెందిన నిర్వాసితులు బుధవారం నిలదీశారు. మా గ్రామంలో ఉన్న ఏడు ఆలయాలకు పునరావాస కాలనీలో చెరువు గట్టును ఎలా కేటాయించారని నిర్వాసితులు ప్రశ్నించారు. దీనికి తోడు చెరువు గట్టు పైన విద్యుత్ హై టెన్షన్ వైర్లు ఉన్నాయని ఇక్కడ నిర్మాణాలు చేస్తే ప్రమాదాలు జరుగుతాయని, దీనికి బాధ్యత ఎవరు వహిస్తారని అన్నారు. ఆలయాలకు కేటాయించిన 13 సెంట్లు స్థలాన్ని చూపించాలని గ్రామస్తులు కోరారు. పార్కుకు కేటాయించిన స్థలంలో మూలపేట నిర్వాసితులకు ఏ విధంగా ఆలయాలకు స్థలాన్ని ఇచ్చారో మిగిలిన స్థలంలో మాకు కూడా అక్కడే ఇవ్వాలని కోరారు. పునరావాస కాలనీ కి వచ్చి 17 నెలలు అవుతున్న ఆలయాలకు సంబంధించిన పరిహారం డబ్బులు ఇంతవరకు ఎందుకు ఇవ్వలేదని అడిగారు. రచ్చబండ నిర్మాణానికి కాలనీలోనే రెండు సెంటు స్థలాన్నిఇవ్వాలని కోరారు. మా త్యాగాలను గుర్తించి మా సమస్యలు పరిష్కరించాలని విష్ణు చక్రం గ్రామానికి చెందిన నిర్వాసితులు కోరారు.



## పీఎస్ పురం ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**మందస, సెప్టెంబరు 2(వార్త):** మందస మండలంలోని పొత్తంగి-సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సంబంధించి 2025-26 విద్యా సంవత్సరంలో 10వ తరగతి విద్యార్థులు మంచి ఉత్తీర్ణత శాతం సాధించడంతో పాటు ఐఐఐటీ సీట్లు సాధించడంలో విశేష కృషి చేసిన ప్రధానోపాధ్యాయులను, బోధన, బోధనేతర సిబ్బందిని పూర్వ విద్యార్థుల సంఘం, గ్రామస్తులు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, వారిని పరీక్షలకు సన్నద్ధం చేయడంలో, ఉన్నత లక్ష్యాలను సాధించేలా ప్రోత్సహించడంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చేసిన కృషిని పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు సురేశ్ చంద్ర పండా, జె.రామారావు(ఏఎస్ఐ), కె.రవీంద్ర, హరిచంద్రశెట్టి పాల్గొని ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను సత్కరించి అభినందనలు తెలిపారు. సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.తారకేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల విజయానికి ప్రధాన కారణం ఉపాధ్యాయుల సమిష్టి కృషి, విద్యార్థుల క్రమశిక్షణ, తల్లిదండ్రుల సహకారమని పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థులు 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించడం, ఐఐఐటీ వంటి ప్రతిష్మాత్మక విద్యాసంస్థల్లో సీట్లు సాధించడం పాఠశాలకు గర్వకారణమని అన్నారు. విద్యార్థుల విజయాన్ని గుర్తించి ఉపాధ్యాయులను సన్మానించిన పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులకు, గ్రామస్తులకు ప్రధానోపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల విద్యాభివృద్ధికి మరింత అంకితభావంతో పని చేస్తామని ఆయన తెలిపారు. ఉపాధ్యాయుల కృషి -- విద్యార్థుల విజయానికి బాట, విద్యార్థుల విజయం--పాఠశాల ప్రతిష్ఠకు ప్రతీక అని ప్రధానోపాధ్యాయుడు తారకేశ్వరరావు అన్నారు.

# అంగన్వాడీ చిన్నారులకు ప్రాథమిక దశ నుంచే మెలకువలు నేర్పాలి



**నరసన్నపేట, సెప్టెంబరు 2 (వార్త):** అంగన్వాడీ కేంద్రాల్లో నాలుగేళ్లలోపు చిన్నారులకు విద్యాబుద్ధులతో పాటు వారి వయస్సుకు తగిన వివిధ అంశాలపై అవగాహన కల్పించాలని నరసన్నపేట మండల విద్యాశాఖాధికారి (ఎంఈవో) ఉప్పాడ శాంతారావు సూచించారు. చిన్నారుల భవిష్యత్‌కు ప్రాథమిక దశ ఎంతో కీలకమైనదని, ఈ సమయంలోనే వారికి అవసరమైన మెలకువలు, మంచి అలవాట్లు నేర్పాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం నరసన్నపేట మండలంలోని కిల్లాం అంగన్వాడీ కేంద్రాన్ని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామ్మూర్తితో కలిసి ఆయన పరిశీలించారు. కేంద్రంలో చిన్నారులకు అందుతున్న బోధన, సంరక్షణ, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. అంగన్వాడీ కార్యకర్తతో మాట్లాడి పిల్లలకు నిర్వహిస్తున్న బోధన కార్యక్రమాల గురించి వివరాలు తెలుసుకున్నారు. చిన్నారుల్లో చిన్న వయస్సు నుంచే నేర్చుకునే ఆసక్తిని పెంపొందించే విధంగా బోధన సాగాలని ఎంఈవో సూచించారు. అక్షరాలు, సంఖ్యలతో పాటు పరిశుభ్రత, ఆరోగ్యం, వ్యక్తిగత అలవాట్లు, సామాజిక మెలకువలు వంటి అంశాలపై కూడా వారికి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ప్రాథమిక స్థాయిలో పిల్లలకు సరైన మార్గదర్శనం అందించడం ద్వారా వారి మానసిక, మేధో వికాసానికి బలమైన పునాది ఏర్పడుతుందని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల అవసరాలకు అనుగుణంగా స్నేహపూర్వక వాతావరణంలో విద్యాబోధన అందించాలని సూచించారు. ఈ సందర్భంగా బమ్మిడి శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ చిన్నారుల సమగ్ర అభివృద్ధిలో అంగన్వాడీ కేంద్రాల పాత్ర కీలకమని పేర్కొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో జనసేన బలోపేతానికి కృషి

- పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం
- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు
- బైక్ ర్యాలీ, రక్తదాన శిబిరాలు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు

**నరసన్నపేట, సెప్టెంబరు 2 (వార్త):** రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గంలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేస్తామని నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి బలగ ప్రవీణ్ తెలిపారు. పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్టం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. డిప్యూటీ ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం నియోజకవర్గంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో పాటు రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని ఆకాంక్షించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి జనసేన శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు.

పవన్ కళ్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని బైక్ ర్యాలీ నిర్వహించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసినట్లు బలగ ప్రవీణ్ తెలిపారు. పవన్ కళ్యాణ్ ఆశయాలు, ప్రజాసేవా కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో గ్రామస్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ సత్తా చాటేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## చరిత్రలో నిలిచిన మహానుభావుడు వైయస్సార్



**సోంపేట, సెప్టెంబరు 2 (వార్త):** అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించి ప్రజల హృదయాల్లో చిరస్మరణీయుడుగా నిలిచిన డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి మహానుభావుడని పార్టీ నేతలు కొనియాడారు. మంగళవారం వైయస్సార్ వర్ధంతి సందర్భంగా సోంపేటలో ఆయన విగ్రహానికి ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు , జడ్పిటిసి తడక యశోద తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైయస్సార్ మన మధ్య లేకపోయినా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో ఆయన చేపట్టిన అభివృద్ధి శాశ్వతంగా నిలిచిందని అన్నారు. పేదల గుండెల్లో శాశ్వతంగా నిలిచిన మహానుభావుడని అన్నారు. జలయజ్ఞం ద్వారా రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసిన గొప్ప దార్శనికుడని కొనియాడారు. ఆరోగ్యశ్రీ వంటి పథకాన్ని ప్రవేశపెట్టి తెలుగు ప్రజలకు ఉచిత వైద్యంపై భరోసా ఇచ్చిన మహా నాయకుడని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ఇచ్ఛాపురంలో ఘనంగా వైఎస్సార్ వర్ధంతి



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 2(వార్త):** దివంగత ముఖ్యమంత్రి వై ఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఇచ్ఛాపురం బస్ స్టాండ్ టూరిజం పార్కు ఎదురుగ ఉన్న వై ఎస్ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం లో పార్టీ సమన్వయ కర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ నర్తు రామారావు జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ పిరియ విజయ,ఎంపిపి లు బోర పుష్ప పైల దేవదాస్ రెడ్డి జడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ రెడ్డి కడియాల ప్రకాష్ ఆసి కృష్ణా రెడ్డి చాట్ల తులసీ దాస్ రెడ్డి పిలక రాజ్యలక్ష్మి బచ్చు జగన్ పిలక యాదవ రెడ్డి గుజ్జు తారాకేష్ రెడ్డి దుక్క ధనలక్ష్మి మద్ది హిమ శైలజ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# పోలాకి మండల పరిషత్ సమావేశంలో ఉద్రిక్తత

**- జడ్పీటీసీ కృష్ణచైతన్య హాజరు నేపథ్యంలో భారీ పోలీసు బందోబస్తు**

**- అభివృద్ధి పనులకు అనుమతుల అంశంపై అధికారులను ప్రశ్నించిన జడ్పీటీసీ**

**- పోలీసుల మోహరింపుపై వైసీపీ నాయకులు, కార్యకర్తల నిరసన**



**పోలాకి, సెప్టెంబరు 2 (వార్త):** పోలాకి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఉద్రిక్త వాతావరణంలో సాగింది. జడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య సమావేశానికి హాజరవుతున్న నేపథ్యంలో పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసుల మోహరింపుపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. మండలంలో జడ్పీ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ఆటంకాలు కలుగుతున్నాయంటూ ఇటీవల కృష్ణచైతన్య ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సర్వసభ్య సమావేశం సందర్భంగా మరోసారి వివాదం తలెత్తే అవకాశం ఉందనే అంచనాతో పోలీసులు కార్యాలయం పరిసరాల్లో బందోబస్తు నిర్వహించారు. ఎంపీపీ ఆహ్వానం మేరకు జడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు. అయితే సమావేశానికి వచ్చిన ప్రజాప్రతినిధికి సంబంధించి భారీగా పోలీసులను మోహరించడం సరైన విధానం కాదంటూ వైసీపీ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న కృష్ణచైతన్యను లక్ష్యంగా చేసుకుని కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారంటూ వారు ఆరోపించారు. సమావేశంలో జడ్పీ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు అనుమతులు ఇవ్వడంలో జరుగుతున్న జాప్యంపై ధర్మాన కృష్ణచైతన్య అధికారులను ప్రశ్నించారు. మండల అభివృద్ధికి సంబంధించిన పనుల విషయంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని నిలదీశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఉన్నప్పటికీ కొందరు అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో రాజకీయాలకు అతీతంగా అధికారులు పని చేయాలని ఆయన సూచించారు. ప్రజలకు ఉపయోగపడే పనులను నిలిపివేయడం లేదా ఆలస్యం చేయడం సరికాదని పేర్కొన్నారు. ప్రభుత్వ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు అవసరమైన అనుమతులు సకాలంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్వసభ్య సమావేశం అనంతరం మండల పరిషత్ కార్యాలయం వద్ద వైసీపీ నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి ధర్మాన కృష్ణచైతన్య మాట్లాడారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను అనవసరంగా ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారుల తీరుపై భవిష్యత్తులో ప్రశ్నిస్తామని హెచ్చరించారు. ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాల విషయంలో పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. తమ పార్టీ కార్యకర్తలు, నాయకులకు అన్యాయం జరిగితే సహించేది లేదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కృష్ణచైతన్యకు మద్దతు తెలిపారు. పోలాకి మండల పరిషత్ సమావేశం సందర్భంగా రాజకీయ నాయకుల హాజరు, పోలీసుల భారీ బందోబస్తు, అభివృద్ధి పనులపై అధికారులను నిలదీయడం వంటి పరిణామాలతో కార్యాలయ పరిసరాల్లో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## బాధ్యతాయుతంగా రీసర్వే పూర్తి చేయాలి

**-జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్**

**-మందసలో ఆకస్మిక పర్యటన**

**-అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం**



**మందస, సెప్టెంబరు 2(వార్త):** మందస మండలంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ బుధవారం ఆకస్మికంగా పర్యటించారు. మందస మండలంలోని గ్రౌండ్ ట్రూథింగ్ జరుగుతున్న 15 గ్రామాలలో గ్రౌండ్ ట్రూథింగ్, ఈకేవైసీ పురోగతిపై గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రౌండ్ ట్రూథింగ్ వేగవంతంగా, సక్రమంగా చేయవలెనని ఆదేశించారు. వెక్టోరైజేషన్, వీఎస్ లాగిన్, వీఆర్వో లాగిన్, డీఎల్ఆర్ ఇన్ తహసీల్దార్ లాగిన్ నిర్ణీత సమయంలో, సరైన పద్ధతిలో చేయాలన్నారు. మందస మండలంలో మొత్తం 83 గ్రామాలలో 47 గ్రామాలకు రీ సర్వే పూర్తిచేయడం జరిగిందని తెలిపారు. మిగిలిన 36 గ్రామాలలో మార్చి నెల 2027లోగా పూర్తి చేసి, రైతులు భూములకు పట్టాదారు పాసు పుస్తకములు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.శ్రీహరి, డిప్యూటీ తహసీల్దార్ కింతలి రామక్రిష్ణ, మండల సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## రెండేళ్లలో రెండు దశాబ్దాల అభివృద్ధి



**శ్రీకాకుళం, సెప్టెంబరు 2 (వార్త):** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో రెండు దశాబ్దాల్లో సాధించే అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందించిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కురుపాం నియోజకవర్గ పరిశీలకుడు మాదారపు వెంకటేష్ అన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యమిస్తూ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. శ్రీకాకుళం నగర కార్పొరేషన్ 50వ డివిజన్ పరిధిలోని 112వ పోలింగ్ బూత్‌లో మాజీ కౌన్సిలర్, ఇన్‌చార్జి సీపాన మల్లేశ్వరరావు, యువ నాయకుడు సీపాన రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'రెండేళ్ల అభివృద్ధి--సంక్షేమం--నమ్మకం--విశ్వాసం.. ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లను ప్రతినెలా ఒకటో తేదీన సకాలంలో అందిస్తున్నామని తెలిపారు. మెగా డీఎస్సీ ద్వారా 16 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, పోలీసు నియామకాలు చేపట్టామని పేర్కొన్నారు. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు సకాలంలో జీతాలు, పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ, మత్స్యకార భరోసా, అన్న క్యాంటీన్ల పునఃప్రారంభం వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. అమరావతి, పోలవరం పనులతో పాటు భోగాపురం విమానాశ్రయం, రైల్వే జోన్, పరిశ్రమలు, పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులు నారా లోకేష్, కింజరాపు అచ్చెన్నాయుడు, కింజరాపు రామ్మోహన్‌నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరుల కృషితో రాష్ట్రం అభివృద్ధి దిశగా సాగుతోందని వెంకటేష్ అన్నారు.

# వైఎస్సార్‌కు ఘన నివాళులు

**- లోపెంటలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు**

**- డీసీసీ అధ్యక్షుడు సనపల అన్నాజీరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలోకి పది కుటుంబాలు చేరిక**



**లావేరు, సెప్టెంబరు 2 (వార్త):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా లావేరు మండలం లోపెంట గ్రామంలో మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. శ్రీకాకుళం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సనపల అన్నాజీరావు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులతో కలిసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ ప్రజలకు అందించిన సేవలను కాంగ్రెస్ నాయకులు స్మరించుకున్నారు. పేదలు, రైతులు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కాంగ్రెస్ కార్యకర్తపై ఉందని అన్నారు. అనంతరం లోపెంట గ్రామంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. దేశంలో రాహుల్ గాంధీ నాయకత్వం, రాష్ట్రంలో వైఎస్ షర్మిలారెడ్డి అంకితభావంతో చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులై శ్రీకాకుళం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సనపల అన్నాజీరావు ఆధ్వర్యంలో పది కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు నాయకులు తెలిపారు. పార్టీలో చేరిన వారికి అన్నాజీరావు స్వాగతం పలికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అన్నాజీరావు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పనిచేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం, సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ప్రజల ఆదరణతో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని, భవిష్యత్తు కాంగ్రెస్ పార్టీదేనని ధీమా వ్యక్తం చేశారు. కరణపు లక్ష్మి, బండి లింగరాజు, నాయిని పాపారావు, పరపతి రామారావు, నేతల రమేష్, పునుబల్లి రామారావు, బండి భాస్కరరావు, నేతల దాలివాడు, కరణపు సన్యాసి, జీరు సన్యాసి, జీరు అప్పలరాముడు, జీరు పరిసినాయుడు తదితర కుటుంబాల సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు ఇజ్జురోతు రమణ, నియోజకవర్గ కో–ఆర్డినేటర్ అబోతుల వెంకటనాయుడు, లావేరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నేతల ఆదినారాయణ, అలపాన సీతయ్యారెడ్డి, జి.సిగడాం ఓబీసీ చైర్మన్ పిన్నింటి పారన్నాయుడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రజల గుండెల్లో చిరస్థాయిగా వైఎస్సార్

**నరసన్నపేట, సెప్టెంబరు 2 (వార్త):** ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తన రాజకీయ జీవితాన్ని కొనసాగించిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం కూడా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని వైసీపీ నేత ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా బుధవారం నరసన్నపేటలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ధర్మాన కృష్ణచైతన్య మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం వైఎస్సార్ అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారని గుర్తుచేశారు. రైతులు, విద్యార్థులు, నిరుపేదలు, మహిళలు, గ్రామీణ ప్రాంత ప్రజల అభివృద్ధి కోసం ఆయన ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలు దేశ రాజకీయాల్లో కొత్త దిశను చూపించాయని పేర్కొన్నారు. వైఎస్సార్ అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు కేవలం అప్పటి ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం కాకుండా, వాటిలోని పలు అంశాలు నేడు దేశంలోని అనేక రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని అన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వారి సంక్షేమం కోసం నిరంతరం పరితపించిన నాయకుడిగా వైఎస్సార్ చరిత్రలో నిలిచిపోతారని



కొనియాడారు. అనంతరం వైసీపీ నాయకులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సంక్షేమం కోసం పనిచేయాలని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు

**- ఇచ్ఛాపురంలో జనసేన యువజన విభాగం సందడి**

**-యువత, జనసైనికులు, వీర మహిళలతో భారీ బైక్ ర్యాలీ**

**-స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు**

**-యువజన విభాగం లోగో ఆవిష్కరణ**

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 2 (వార్త):** ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఇచ్ఛాపురం నియోజకవర్గంలో జనసేన పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పాటు ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి నుంచి యువత, జనసైనికులు, వీర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో భాగంగా ముందుగా స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలోదాసరి రాజు జనసైనికులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవన్ కళ్యాణ్ గోత్రనామాలతో అమ్మవారికి పూజలు నిర్వహించి, చీర--జాకెట్ సమర్పించారు. పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలు, ప్రజాసేవలో మరింత విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయం నుంచి యువత, జనసైనికులు, వీర మహిళలతో కలిసి భారీ బైక్ ర్యాలీని ప్రారంభించారు. జనసేన పార్టీ జెండాలతో ఉత్సాహంగా సాగిన ఈ ర్యాలీ ఇచ్ఛాపురం పట్టణంలోని ప్రధాన మార్గాల మీదుగా కొనసాగి బస్టాండ్ కూడలికి చేరుకుంది. ర్యాలీలో యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో పట్టణంలో జనసేన సందడి నెలకొంది. కార్యక్రమంలో జాయింట్ సెక్రెటరీలు తిప్పన దుర్యోధన రెడ్డి బైపల్లి ఈశ్వర్ హరి బెహరా ఏఎంసీ డైరెక్టర్స్ దుంగు బాష్కర్ బడే రాజు దున్న పాపారావు రాజశేఖర్ ఏఎంసీ వైస్ చైర్మన్స్ చంద్ర శేఖర్ దాసరి శేఖర్ సురేష్ రుక్మేంద్ర రెడ్డి శ్యామ్ రెడ్డి కల్యా ప్రేమ్ కుమార్ జనసేన వీర మహిళలు శైలజ రోజా నాగ మాధవి జయ జనసేన పార్టీ నాయకులు, యువజన విభాగం ప్రతినిధులు, జనసైనికులు, వీర మహిళలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన రహదారుల వెంబడి పిచ్చి మొక్కలు తొలగించాలి

**- నరసన్నపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో చర్యలు చేపట్టాలని డిమాండ్**

**- రోడ్లకు ఇరువైపులా పెరిగిన మొక్కలతో ప్రమాదాల ముప్పు**

**- కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన కాంగ్రెస్ నాయకులు**

**నరసన్నపేట, సెప్టెంబరు 2 (వార్త):** నరసన్నపేట నియోజకవర్గ పరిధిలోని ప్రధాన గ్రామీణ రహదారులకు



ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర నాయకులు, శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గం 2024 అభ్యర్థి నాయుడుగారి రాజశేఖర్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట మండలాల పరిధిలోని పలు ప్రధాన గ్రామీణ రహదారుల వెంట పిచ్చి మొక్కలు, పొదలు విపరీతంగా పెరిగి వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని ఆయన తెలిపారు. ముఖ్యంగా రోడ్డు మలుపులు, ఇరుకైన ప్రాంతాల్లో ఈ మొక్కల కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు సరిగా కనిపించక ప్రమాదాలు చోటుచేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితుల కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగినట్లు పేర్కొన్నారు. వర్షాకాలంలో పిచ్చి మొక్కలు మరింతగా పెరిగి రహదారులను ఆక్రమించే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. భవిష్యత్తులో తీవ్ర ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. నరసన్నపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎంపీడీవోలు, ఏపీవోలు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే సంబంధిత ఆర్‌అండ్‌బీ ఇంజినీర్లకు అవసరమైన ఆదేశాలు జారీ చేసి రహదారుల ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నాయుడుగారి రాజశేఖర్‌తో పాటు జలుమూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, శ్రీముఖలింగం గ్రామ మాజీ సర్పంచ్ గుంట కర్ణవీరుడు పాల్గొన్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే రహదారి సమస్యలను అధికారులు ప్రాధాన్యతగా తీసుకుని సత్వర చర్యలు చేపట్టాలని వారు కోరారు.

## వైసీపీ వారి ఇళ్ల గోడల కూల్చివేతపై కృష్ణచైతన్య ఆగ్రహం

**నరసన్నపేట, సెప్టెంబరు 2 (వార్త):** కూటమి ప్రభుత్వ పాలనలో ముందుగా నిర్దేశించుకున్నట్లు చెప్పబడుతున్న 'రెడ్‌బుక్ రాజ్యాంగం' అమలవుతోందని వైసీపీ నేత ధర్మాన కృష్ణ చైతన్య విమర్శించారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నరసన్నపేట మండలం యారబాడు గ్రామంలో బుధవారం వైసీపీ కుటుంబాలకు చెందిన ఇళ్ల గోడలను కూల్చివేసిన ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. రాజకీయ అనుబంధాలను పరిగణనలోకి తీసుకుని కొందరిపై లక్ష్యంగా చర్యలు చేపట్టడం సరికాదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి ఒక్కరికీ సమాన న్యాయం జరగాల్సిన అవసరం ఉందన్నారు. వైసీపీకి చెందిన కుటుంబాలపై వివక్షతో వ్యవహరిస్తూ వారి ఆస్తులకు నష్టం కలిగించే చర్యలకు పాల్పడుతున్నారని ధర్మాన కృష్ణ చైతన్య ఆరోపించారు. అధికారంలో ఉన్నవారు తమ రాజకీయ ప్రత్యర్థులపై కక్ష సాధింపు ధోరణిని విడనాడాలని సూచించారు. యారబాడు ఘటనలో భాగస్వాములైన కూటమి నాయకులు, చర్యలు తీసుకున్న అధికారుల వ్యవహారాన్ని భవిష్యత్తులో పరిశీలిస్తామని ఆయన హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా, రాజకీయ ఒత్తిళ్లతో వ్యవహరించిన వారిపై తగిన చర్యలు తీసుకోక తప్పదని స్పష్టం చేశారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే వరకు వైసీపీ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.



## ఘనంగా శ్రీ విద్యా వాహిని కళాశాలలో ఫ్రెషర్స్ డే

**-విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి**

**-ఆరోగ్యం, క్రమశిక్షణతో విజయాన్ని సాధించాలి**

**పలాస, సెప్టెంబరు 2 (వార్త):** శ్రీ విద్యా వాహిని జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ హెచ్. రాజ్‌కుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే ఆరోగ్యంపై శ్రద్ధతో పాటు క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థి దశలో ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించుకోవడం భవిష్యత్ విజయాలకు పునాది అవుతుందని తెలిపారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ప్రముఖ ఉపన్యాసకులు, స్ఫూర్తి ప్రదాత శ్రీ రామ్ బుద్ధి గణపతి విద్యార్థులకు స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో ముందుకు సాగితే విజయాన్ని సాధించవచ్చని చెప్పారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న శ్రీ సాయి శిరీష హైస్కూల్ కరస్పాండెంట్ కొర్ల భారతి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకుని, దానిని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. సబ్ ట్రెజరీ ఆఫీసర్ పేరాడ మన్మథరావు తన జీవితంలో కష్టపడి సాధించిన విజయాలను విద్యార్థులతో పంచుకుని, పట్టుదలతో శ్రమిస్తే లక్ష్యాలను చేరుకోవచ్చని తెలిపారు. ప్రత్యేక అతిథి బి. కోదండరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సమాజంలో ఆదర్శంగా నిలిచేలా తమ ప్రవర్తనను తీర్చిదిద్దుకోవాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్సాహభరిత ప్రదర్శనలతో వేడుక సందడిగా నిర్వహించి చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ పైల తిరుమలరావు, కళాశాల ఏఓ పి. మన్మథరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ ఆయుధం గిరిబాబు, ఏఓ టి. కేశ్వరరావు, ఇంటర్ వైస్ ప్రిన్సిపాల్ అందాల మురళితో పాటు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# సంక్షేమ నాయకుడు డాక్టర్ వైఎస్ఆర్

**-ప్రజల మనసుల్లో ఎప్పటికీ ఉంటారు...**

**- ఘనంగా**

**మాజీ సీఎం వైఎస్సార్ వర్ధంతి**



**మందస, సెప్టెంబరు 2(వార్త):** ప్రజల సంక్షేమానికి ఎంతో కృషి చేసిన మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల మనసుల్లో ఎల్లప్పటికీ చిరస్థాయిగా ఉంటారని మందస ఎంపీపీ డొక్కరి దానయ్య అన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా మందస మండలంలోని బేతాళపురం పంచాయతీ రట్టి గ్రామంలోని డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి డొక్కరి దానయ్య ఆధ్వర్యంలో పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు పులారి పితంబరం, మాజీ సర్పంచ్ మామిడి సింహాద్రి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సొర్ర ఢిల్లీరావు, యువజన నియోజవర్గ అధ్యక్షుడు దున్న హరికృష్ణ, జిల్లా యువజన కార్యదర్శి రాపాక శేషగిరి, జిల్లా యువజన కార్యదర్శి పులారి కూర్మారావు, పులారి తవిటయ్య, బొంగు పురుషోత్తం, రట్టి వైకుంఠరావు, కొల్లి మోహనరావు, పులారి పాపయ్య, మామిడి అప్పన్న, గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

## ఉమాగిరి వద్ద...

మందస మండలంలోని జిల్లుండ పంచాయతీలో గల ఉమాగిరి గ్రామం వద్ద డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి వేడుకలు జరిగాయి. ముందుకు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నేడు భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలు, ప్రజల పట్ల ఆయన చూపిన అభిమానం, సేవా దృక్పథం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. రాజశేఖరరెడ్డి మరణం తీరనిలోటన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు అగ్గున్న సూర్యారావు, గిన్ని తిరుపతిరెడ్డి, శానాపతి కిషోర్ కుమార్, సిందిరి జగన్, చింతాడ గణపతి, తలగాన హరిక్రిష్ణ, తలగాన వెంకటరావు, కొండల ఢిల్లేశ్వరావు, గయా సంతోష్, బాడ జగన్నాయకులు, కురేషు, మట్ట బెనర్జీ, సుగ్గు కోటి, తురక గణపతి తదితరులు పాల్గొన్నారు.

## భేతాళపురంలో...

బేతాళపురం గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆదేశాల మేరకు బేతాళపురం గ్రామంలోని వైఎస్సార్ ఘాట్ వద్ద డా.వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం బోర్డు మాజీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ అధ్యక్షుడు బత్తిని లక్ష్మణ్ ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చేపట్టిన జలయజ్ఞం, ఆరోగ్యశ్రీ, 108, రైతు రుణమాఫీ, రూపాయికే కిలో బియ్యం, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు పేదలు, రైతులు, విద్యార్థులు, సామాన్య ప్రజలకు ఎంతో ఉపయోగపడ్డాయని కొనియాడారు. కార్యక్రమంలో పంచాయతీ పార్టీ అధ్యక్షుడు తాడాల దామోదర్, మాజీ సర్పంచ్ శ్రీమతి గుంటు పార్వతి, సంగారు కృష్ణారావు, స్థలదాత తాడాల అప్పలస్వామి, పల్లెటి రూపారావు, పుక్కల్ల లోకనాథం, జుత్తు నారాయణ, సంగారు సోమయ్య, అడతాల ఎర్రయ్య, కోడ రామస్వామి, మడియా రుషి, కోడ శ్రీనివాస్, గుంటు కపిల్, పుక్కళ్ళ లోకనాథం, గుంటు చంద్రయ్య, బత్తిని మహేష్, అంబటి సూరి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బుడారిసింగిలో మాజీ సర్పంచ్ సురేష్ కుమార్ పాణిగ్రాహి ఆధ్వర్యంలో జరిగాయి. భైరిసారంగపురంలో జరిగిన డాక్టర్ వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మురపాల నారాయణరావు, గుసిరి తాతయ్య, చింతాడ గణపతి, పొందూరు మన్మథరావు, బాడ జగన్నాయకులు, వల్లభ అశోక్, రట్టి గణేశ్, చింతాడ చలపతి, గున్న రమణ, దంతం లింగరాజు, మట్ట పారయ్య పాల్గొన్నా

## వైఎస్సార్ స్ఫూర్తితో బాధిత కుటుంబాలకు బాబా చేయూత

**- నాలుగు కుటుంబాలకు రూ.20 వేల సాయం**

**- వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా దువ్వాడ శ్రీధర్‌బాబా సేవా కార్యక్రమం**



**పలాస, సెప్టెంబరు 2(వార్త):** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించుకుని పలాస నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, ప్రముఖ న్యాయవాది, పలాస జిల్లా సాధన కమిటీ కన్వీనర్ దువ్వాడ శ్రీధర్(బాబా) మానవతా దృక్పథంతో సేవా కార్యక్రమం చేపట్టారు. అనారోగ్యం, ప్రమాదం, అకాల మరణంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నాలుగు నిరుపేద కుటుంబాలను పరామర్శించి, ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున మొత్తం రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు.

-పలాస మండలం మాకన్నపల్లి గ్రామానికి చెందిన పోతనపల్లి గణపతి కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నారు. అనారోగ్యంతో పని చేయలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆయనకు వైద్య ఖర్చుల కోసం రూ.5 వేల సాయం అందించారు.

-వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవుకు చెందిన చామంతి భారతమ్మ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకునేందుకు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న శ్రీధర్‌బాబా ఆమె కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు.

-అదే గ్రామానికి చెందిన బైనపల్లి నొందో ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో పడింది. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన శ్రీధర్‌బాబా రూ.5 వేల సాయం అందించి ధైర్యం చెప్పారు.

-మందస మండలం లోహరిబంద గ్రామానికి చెందిన నర్తు వెంకటరమణ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నారు. చేతులు, కాళ్లకు గాయాలు కావడంతో ఉపాధికి దూరమయ్యారు. కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న శ్రీధర్‌బాబా రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు.

ఈ సందర్భంగా శ్రీధర్‌బాబా మాట్లాడుతూ వైఎస్సార్ చూపిన మానవతా, సేవా స్ఫూర్తిని కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం, బాధితులకు భరోసా కల్పించడం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. పదవులు, హోదాల కంటే ప్రజా సేవకే ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూన హేమాచలం, దువ్వాడ నవీన్‌చౌదరి, హరిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## పోలాకి ఎంపీడీవోగా సూర్యప్రకాశరావు బాధ్యతల స్వీకరణ



**పోలాకి, సెప్టెంబరు 2 (వార్త):** పోలాకి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బలగ సూర్యప్రకాశరావు పూర్తి అదనపు ఛార్జీ (ఎఫ్ఏసీ)తో బాధ్యతలు చేపట్టారు. ఇటీవల మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా విధులు నిర్వహించిన జీవీ రవికుమార్ పదవీ విరమణ చేయడంతో ఆ స్థానంలో సూర్యప్రకాశరావుకు అదనపు బాధ్యతలను జిల్లా అధికారులు అప్పగించారు. ప్రస్తుతం పోలాకి మండలంలో పరిపాలన అధికారిగా విధులు నిర్వహిస్తున్న సూర్యప్రకాశరావు ఎంపీడీవో బాధ్యతలను కూడా స్వీకరించారు. మండల పరిధిలోని గ్రామాల అభివృద్ధి, ప్రభుత్వ పథకాల సమర్థవంతమైన అమలు, ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఆయన తెలిపారు. మండల అభివృద్ధికి అధికారులు, సిబ్బంది సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ పూర్తి సహకారం అందించాలని కోరారు. సిబ్బంది సహకారంతో మండల పరిషత్‌ను అభివృద్ధి పథంలో ముందుకు నడిపించేందుకు తనవంతు కృషి చేస్తానని సూర్యప్రకాశరావు తెలిపారు. మండలంలోని ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి కార్యక్రమాల అమలులో సమన్వయంతో పనిచేస్తామని పేర్కొన్నారు.

## బారువా బాలికలకు ఎంబీబీఎస్ కన్వీనర్ సీట్లు




**సోంపేట, సెప్టెంబర్ 2 (వార్త):** బారువ గ్రామానికి చెందిన చొక్కల చైతన్య, తమాడ అఖిల లకు ఎంబిబిఎస్ ఫ్రీ సీట్లు లభించాయి. తాజాగా జరిగిన కౌన్సిలింగ్ లో ఇటువంటి అవకాశాలు లభించడంతో ఆయా కుటుంబాలు హర్షం వ్యక్తం చేసాయి. చొక్కల లోకనాథం,లక్ష్మి భాయ్ దంపతుల కుమార్తె చైతన్యకు విశాఖపట్నంలోని ఎన్ఆర్ఐ కళాశాలను కేటాయించగా, జింకీభద్ర కు చెందిన తామడ జానకిరావు,పుష్పలత దంపతుల కుమార్తె అఖిలకు అమలాపురంలోని కోనసీమ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ను కేటాయించారు. అఖిల బారువలో బంధువుల ఇంటి వద్దనే చదువుకుంటూ పెరిగినప్పటికీ స్వగ్రామం జింకి భద్ర. వీరిద్దరికీ ఎంబీబీఎస్ సీట్లు దక్కడంతో ఆయా గ్రామాల్లో బంధువులు, స్నేహితులు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాల్లోకి ఎదగాలని ఆకాంక్షించారు.చైతన్య ప్రతిభ సాధించడం పట్ల సోంపేట కు చెందిన శ్రీశయన చైతన్య దీపిక సంస్థ అభినందనలు తెలిపింది.



# మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

**- రూ.50 వేల ఉచిత ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన ఎగ్ కార్ట్ ప్రారంభం**

**- మహిళలను చిన్న తరహా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం**

**- నరసన్నపేటలో యూనిట్‌ను ప్రారంభించిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన**

**నరసన్నపేట, సెప్టెంబరు 2 (వార్త):** మహిళలను ఆర్థికంగా స్వావలంబన దిశగా నడిపిస్తూ చిన్న తరహా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట వేస్తూ వివిధ పథకాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. నరసన్నపేట పట్టణంలో బుధవారం బాడాన లలిత అనే మహిళా సభ్యురాలికి మంజూరైన రూ.50 వేల ఉచిత ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన ఎగ్ కార్ట్ యూనిట్‌ను బగ్గు అర్చన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే కుటుంబంతో పాటు సమాజం కూడా పురోగమిస్తుందని అన్నారు. సెర్ఫ్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో అమలవుతున్న ఉపాధి, స్వయం ఉపాధి కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందించి మహిళలను స్వయం ఉపాధి రంగంలో ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. చిన్న స్థాయి వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సాహం అందించడం ద్వారా మహిళలు సొంతంగా ఆదాయం సమకూర్చుకునే అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. మహిళలను కేవలం లబ్ధిదారులుగానే కాకుండా స్వయం ఉపాధి ద్వారా ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి తీసుకెళ్లాలన్నదే ప్రభుత్వ సంకల్పమని అర్చన అన్నారు. ఆర్థికంగా బలోపేతమైన మహిళ కుటుంబ నిర్ణయాల్లోనూ కీలక పాత్ర పోషించగలరని, అందుకే మహిళా సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి గొద్దు చిట్టిబాబు, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కింజరాపు రామారావు, నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షుడు బోయిన సతీష్, పీఏసీఎస్ డైరెక్టర్ సరిపల్లి మధు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పుచ్చల కల్పన, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు బతకల సంతోషి, జిల్లా తెలుగు నాడు ఫెడరేషన్ అధ్యక్షుడు బలగ ప్రహర్ష, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు రావాడ గణపతిరావు, కార్యదర్శి బతకల గోపి, బూత్ కన్వీనర్ దుప్పలపూడి లక్ష్మణరావుతో పాటు వెలుగు సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరింది

**- పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా విశాఖ వరకు గోదావరి జలాల తరలింపుపై హర్షం - సీఎం చంద్రబాబు చేతుల మీదుగా జలాలకు హారతి ఇవ్వడం చారిత్రక ఘట్టమన్న రోణంకి కృష్ణన్నాయుడు - రాష్ట్ర అభివృద్ధికి ఎన్డీఏ కూటమికి ప్రజలు మద్దతివ్వాలని పిలుపు**




**నరసన్నపేట, సెప్టెంబరు 2 (వార్త):** ప్రజల అవసరాలు, ప్రయోజనాలను గుర్తించి వాటికి అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఏపీ రాష్ట్ర ప్రభుత్వ కళింగ అభివృద్ధి, సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ రోణంకి కృష్ణన్నాయుడు పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన గోదావరి జలాలను విశాఖపట్నం వరకు తరలించే కార్యక్రమం కార్యరూపం దాల్చడం ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనమని తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రజలకు ఫలాలు అందించడంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. వెలుగొండ ప్రాజెక్టు ద్వారా రాయలసీమ ప్రాంత ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు గతంలో చేపట్టిన చర్యలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. పోలవరం ప్రాజెక్టు ప్రధాన డ్యాం పనులు కొనసాగుతున్న తరుణంలోనే ఎడమ ప్రధాన కాలువను పూర్తి చేసి గోదావరి జలాలను ఉత్తరాంధ్ర ప్రాంతానికి అందించే చర్యలు చేపట్టడం కీలక పరిణామమన్నారు. సుమారు 213 కిలోమీటర్ల మేర ఎడమ ప్రధాన కాలువ నిర్మాణం పూర్తికావడంతో సుమారు 30 టీఎంసీల నీటిని విశాఖపట్నం వరకు తరలించే అవకాశం ఏర్పడిందని పేర్కొన్నారు. అనకాపల్లి మీదుగా విశాఖపట్నం వరకు గోదావరి జలాలను అందించడం ద్వారా తాగునీరు, సాగునీటి అవసరాలతో పాటు పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరంలోని పరిశ్రమలకు అవసరమైన నీటిని సమకూర్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ నేపథ్యంలో తుని సమీపంలోని పాయకరావుపేట వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గోదావరి జలాలకు హారతి ఇవ్వడం ఉత్తరాంధ్ర చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టమని అభివర్ణించారు. ఉత్తరాంధ్ర ప్రజల తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు రోణంకి కృష్ణన్నాయుడు పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఉత్తరాంధ్ర ప్రజలు ఎదురుచూస్తున్న నీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు భవిష్యత్తులో ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గత పాలకుల హయాంలో పోలవరం ప్రాజెక్టు పనుల విషయంలో నిర్లక్ష్యం జరిగిందని ఆయన విమర్శించారు. అసెంబ్లీ వేదికగా గతంలో చేసిన వ్యాఖ్యలు, ప్రాజెక్టు నిర్మాణంలో చోటుచేసుకున్న జాప్యాన్ని రాష్ట్ర ప్రజలు గుర్తుంచుకోవాలని కోరారు. గత ప్రభుత్వ పాలనలో చేపట్టిన నిర్ణయాల వల్ల రాష్ట్ర అభివృద్ధి దెబ్బతిన్నదని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా సాగుతున్న నేపథ్యంలో వాటిపై కొందరు సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. గతంలో ప్రారంభించి అసంపూర్తిగా వదిలివేసిన పలు ప్రాజెక్టులను ఎన్డీఏ కూటమి ప్రభుత్వం 2014--19 మధ్యకాలంలోనూ, ప్రస్తుతం 2024 నుంచి తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా వేగవంతం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తోందని పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాలపై జరుగుతున్న ప్రచారం, ప్రతిప్రచారాలను రాష్ట్ర ప్రజలు గమనించాలని ఆయన కోరారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, పారిశ్రామిక ప్రగతి, ప్రజా సంక్షేమం కోసం రాబోయే ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి ప్రజలు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర అభివృద్ధికి ఆటంకం కలిగించే రాజకీయాలను ప్రజలు తిరస్కరించాలని, రానున్న స్థానిక సంస్థలతో పాటు ఇతర ఎన్నికల్లో ఎన్డీఏ కూటమిని బలపరచాలని రోణంకి కృష్ణన్నాయుడు పిలుపునిచ్చారు.

# అంగన్వాడీల హక్కుల కోసం సమష్టి పోరాటం



**పలాస, సెప్టెంబరు 2 (వార్త):** తెలుగు నాడు అంగన్వాడి ట్రేడ్ యూనియన్ (టీఎన్ డియు)ను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసి, అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాలని ఎన్.టి.ఏ రాష్ట్ర కన్వీనర్ శారదా నాయుడు పిలుపునిచ్చారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు బుధవారం పలాస ఎమ్మెల్యే కార్యాలయంలో టీఎన్ డియు ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఎన్.టి.ఏ రాష్ట్ర కన్వీనర్ శారదా నాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో యూనియన్ బలోపేతం, సభ్యుల సమన్వయం, సంస్థ కార్యకలాపాలను గ్రామస్థాయి వరకు విస్తరించడం తదితర అంశాలపై చర్చించారు. అంగన్వాడీల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయాల్సిన బాధ్యత యూనియన్ ప్రతినిధులపై ఉందని శారదా నాయుడు సూచించారు. తెలుగుదేశం పార్టీతోనే అంగన్వాడీలకు మేలు జరుగుతుందని ఆమె తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో అంగన్వాడీలు పెద్ద సంఖ్యలో టీఎన్ డియులో చేరి యూనియన్‌ను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. మండలాల వారీగా సభ్యులను సమన్వయం చేసుకోవడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ట్రేడ్ యూనియన్ మరింత పటిష్ఠంగా మారుతుందని తెలిపారు.

## మండలాల వారీగా నియామకాలు

ఈ సందర్భంగా పలాస-కాశీబుగ్గ మండలానికి టీఎన్ డియు అధ్యక్షురాలిగా ఆర్.అప్పలనరసమ్మ, కార్యదర్శిగా కె.జ్యోతిలను నియమించారు. మందస మండలానికి అధ్యక్షురాలిగా పి.సునీత, కార్యదర్శిగా జి.ఝాన్సీరాణిలను నియమించారు. నూతనంగా నియమితులైన ప్రతినిధులు అంగన్వాడీల సమస్యలను యూనియన్ దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సమావేశంలో సూచించారు.

# రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలో డొంకూరు విద్యార్థుల ప్రతిభ



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 2 (వార్త):** డొంకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలో బంగారు పతకాలు సాధించారు. ప్రధానోపాధ్యాయురాలు జి హేమకుమారి ఆధ్వర్యంలో జరిగినటువంటి అభినందన సభ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో డొంకూరు విద్యార్థులుకు బంగారు పథకాలు పొందిన విద్యార్థులు ను అభినందించారు. ఇటీవల తిరుపతి వేదికగా అమరావతి ఛాంపియన్షిప్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డొంకూరు విద్యార్థులు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించారు.రాష్ట్రస్థాయిలో బంగారు పతకాలు పొందిన వారిలో హేమలత, గ్రెస్సీ మేరీ,ఉన్నారు.వీరికి పాఠశాల చైర్మన్ కే జానకి రావు, గ్రామ పెద్దలు దున్న .కూర్మారావ్, దున్న లోకనాథం, ఉపాధ్యాయుని గ్రామస్తులు విద్యార్థులు అభినందనలు తెలియజేశాను.

## గోశాలను తలపిస్తున్న బారువ బీచ్

**సోంపేట, సెప్టెంబరు 2 (వార్త):** బారువ బీచ్ గోశాలను తలపిస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఆవులు విపరీతంగా చేరుకొని బీచ్ లో తిష్ట వేస్తున్నాయని పేర్కొంటున్నారు. దీనివలన బీచ్ లో విపరీతమైన పేడలతో అధ్వానంగా తయారవుతుందని వాపోతున్నారు. బారువ గ్రామపంచాయతీ అధికారులు దీని పట్ల దృష్టి సారించి బీచ్ ను పరిశుభ్రంగా ఉంచి ప్రజలను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని కోరారు.



## టబాగాంలో ఐటీబీపీ కానిస్టేబుల్ ఆత్మహత్య



**మందస, సెప్టెంబరు 2(వార్త):** మందస మండలం కొండలోగాం పంచాయతీ టబాగాం గ్రామానికి చెందిన ఐటీబీపీ కానిస్టేబుల్ సవర శేషగిరి(28) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రస్తుతం ఒడిశా రాష్ట్రంలోని ఖుర్దా యూనిట్‌లో శేషగిరి విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల సెలవుపై స్వగ్రామానికి వచ్చాడు. ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన సాయంత్రం గ్రామ సమీపంలోని జీడి తోటలో చెట్టుకు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని కిందకు దించారు. అనంతరం మందస పోలీసులకు సమాచారం అందించగా వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని హరిపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విధి నిర్వహణలో పని ఒత్తిడి కారణంగా కొంతకాలంగా మానసిక ఆందోళనకు గురవుతున్నట్లు కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపినట్టు సమాచారం. ఈ ఘటనపై మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

# నకిలీ బెంతు ఒరియా కేసుల్లో చర్యలు చేపట్టండి

**- 105 కేసుల్లో హైకోర్టుకు వెంటనే కౌంటర్ దాఖలు చేయాలని డిమాండ్**

**- నిజమైన ఆదివాసీల రిజర్వేషన్ హక్కులకు నష్టం జరుగుతోంది**

**- జిల్లా అధికారులు మౌనం వీడాలి - ఆదివాసీ సంక్షేమ పరిషత్ పిలుపు**



**శ్రీకాకుళం, సెప్టెంబరు 2 (వార్త):** బెంతు ఒరియా కుల ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన వివాదాస్పద కేసుల్లో జిల్లా అధికారులు తక్షణమే స్పందించి హైకోర్టులో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ. యోగి డిమాండ్ చేశారు. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని నిజమైన ఆదివాసీలు అనేక సంవత్సరాలుగా రిజర్వేషన్ ప్రయోజనాలకు సంబంధించి నష్టపోతున్నారని ఆరోపించారు. శ్రీకాకుళం జిల్లాలో బెంతు ఒరియా తెగకు సంబంధించి గతంలో ప్రభుత్వ స్థాయిలో పలు అధ్యయనాలు, నివేదికలు వెలువడ్డాయని వాబ. యోగి పేర్కొన్నారు. 1978లో అప్పటి జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో శ్రీకాకుళం జిల్లాలో బెంతు ఒరియా తెగ లేదని పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. అనంతరం గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలపై అధ్యయనం చేసిన కమిటీ కూడా జిల్లాలోని పలు మండలాల్లో పర్యటించి ప్రభుత్వానికి నివేదిక అందజేసిందని చెప్పారు. కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం, మెళియాపుట్టి, టెక్కలి, పాతపట్నం, సంతబొమ్మాళి తదితర మండలాల్లో అధ్యయనం నిర్వహించిన కమిటీ, విజయనగరం జిల్లాలో ఉన్న బెంతు ఒరియా తెగకు, శ్రీకాకుళం జిల్లాలో తమను బెంతు ఒరియాలుగా పేర్కొంటున్న వారికి మధ్య ఆచార వ్యవహారాలు, సంప్రదాయాల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించిందని ఆయన ఆరోపించారు. ఈ అంశాలకు సంబంధించి గతంలో సమర్పించిన నివేదికల ఆధారంగా ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. నిజమైన ఆదివాసీలకు రాజ్యాంగబద్ధంగా అందాల్సిన 6 శాతం రిజర్వేషన్ ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని వాబ. యోగి ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో నిజమైన గిరిజనులకు నష్టం జరుగుతోందని అన్నారు. 2005 నుంచి పలువురు హైకోర్టును ఆశ్రయించి మధ్యంతర ఉత్తర్వులు పొందుతున్నారని, ఆయా కేసుల్లో జిల్లా యంత్రాంగం ఇప్పటివరకు సమర్థవంతంగా కౌంటర్లు దాఖలు చేయలేదని ఆయన ఆరోపించారు. దీని కారణంగా వైద్య, సాంకేతిక విద్యా సీట్లతో పాటు ప్రభుత్వ ఉద్యోగాల్లో కూడా నిజమైన ఆదివాసీలకు రావాల్సిన అవకాశాలు తగ్గుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రస్తుతం కొనసాగుతున్న 105 కేసుల్లో జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి హైకోర్టులో కౌంటర్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో బెంతు ఒరియాలకు ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం లేదని అధికారులు వివిధ ప్రభుత్వ సంస్థలకు, కమిషన్లకు తెలియజేస్తున్నారని, అదే అంశాన్ని హైకోర్టు ముందు అధికారికంగా ఎందుకు సమర్పించడం లేదని వాబ. యోగి ప్రశ్నించారు. కుల ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించి ప్రభుత్వ అధికారులకు ఉన్న అధికారాలు, న్యాయస్థానాల ఉత్తర్వుల నేపథ్యంలో ఏర్పడుతున్న పరిస్థితులపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు మౌనం వీడి, పెండింగ్‌లో ఉన్న 105 కేసుల్లో వాస్తవాలను హైకోర్టు దృష్టికి తీసుకెళ్లాలని ఆయన డిమాండ్ చేశారు. మధ్యంతర ఉత్తర్వుల అంశంపై న్యాయపరమైన చర్యలు చేపట్టి నిజమైన ఆదివాసీల హక్కులు, రిజర్వేషన్ ప్రయోజనాలను పరిరక్షించాలని కోరారు. విలేకరుల సమావేశంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా కమిటీ సభ్యులు వెంకటేష్, గణేష్, సవర సింహాచలం, జన్ని వాసుతో పాటు పలువురు పాల్గొన్నారు.

# వైఎస్సార్ పాలనలోనే సంక్షేమానికి పెద్దపీట

**-పేదలు, రైతులు, విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా సాగిన పాలన**

**- ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్‌తో పేదల జీవితాల్లో మార్పు**

**-వైఎస్సార్ వర్ధంతి సభలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు**



**పలాస, సెప్టెంబరు 2(వార్త):** దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేదలు, రైతులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, కార్మికులు, మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేశారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. వైఎస్సార్ చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి వైఎస్సార్ ఆశయాలను కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేశారు. వైఎస్సార్ 17వ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం పలాస పట్టణంలో నిర్వహించిన నివాళుల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ 2004లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రైతులకు ఉచిత విద్యుత్ అందించే ఫైలుపై తొలి సంతకం చేసిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. రైతే రాజు అనే నినాదాన్ని ఆచరణలో చూపించిన రైతు బాంధవుడని కొనియాడారు. ఐదేళ్ల పాలనలో పేదలు, రైతులు, విద్యార్థులు, మహిళల సంక్షేమమే ప్రధాన ఎజెండాగా పాలన సాగిందన్నారు. పేదలకు వైద్యం.. విద్యకు భరోసా కల్పించారన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఖరీదైన వైద్యం అందుబాటులోకి తెచ్చారని అప్పలరాజు అన్నారు. 108 అంబులెన్స్, 104 సంచార వైద్య సేవలతో మారుమూల ప్రాంతాల్లోనూ వైద్య సేవలు అందేలా వ్యవస్థను ఏర్పాటు చేశారని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యను చేరువ చేశారని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు, రూ.2 కిలోల బియ్యం, పింఛన్ల పెంపు, పావలా వడ్డీ, అభయహస్తం తదితర పథకాలతో పేద కుటుంబాలకు అండగా నిలిచారని తెలిపారు. జలయజ్ఞం ద్వారా సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇచ్చి బీడు భూములకు నీరందించే ప్రయత్నం చేశారని అన్నారు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలు నేటికీ దేశంలోని అనేక ప్రాంతాలకు ఆదర్శంగా నిలిచాయని అన్నారు.

## 'రైతు భరోసా'ను ఇతరులు అనుసరించారు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు రైతు భరోసా పథకాన్ని అమలు చేశామని అప్పలరాజు తెలిపారు. అనంతరం ఇతర రాష్ట్రాలు, కేంద్రం ఇదే తరహా పథకాలను అమలు చేశాయని తెలిపారు. మేనిఫెస్టోలో ప్రకటించిన మొత్తానికి మించి రైతులకు పెట్టుబడి సాయం అందించిన ఘనత జగన్‌కు దక్కుతుందని అన్నారు. కూటమి పాలనపై విమర్శలు

ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అప్పలరాజు విమర్శించారు. విత్తనాలు, ఎరువుల కోసం రైతులు క్యూలైన్లలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఆరోగ్యశ్రీని పేదల సంక్షేమ పథకంగా కాకుండా బీమా విధానంలోకి మార్చే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. దీనివల్ల ప్రభుత్వ నిధులు ప్రైవేటు బీమా సంస్థలకు మళ్లే అవకాశం ఉందని విమర్శించారు. వైఎస్సార్ ప్రజలతో మమేకమై, ఆత్మీయంగా పలకరించే నాయకుడిగా గుర్తింపు పొందారని అప్పలరాజు అన్నారు. ఆయన మరణించి 17 ఏళ్లు గడిచినా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పైల చిట్టిబాబు, జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, పలాస పట్టణ అధ్యక్షుడు శిష్టు గోపి, సీనియర్ నాయకులు హనుమంతు వెంకట్రావుదొర, అగ్గున సూర్యారావు, కర్రీ గోపాల్, మాజీ కౌన్సిలర్లు బోరా చంద్రకళ, సవర సోమేశ్వరరావు, పలాస రూరల్ మండల నాయకులు ఉంగసాయి కృష్ణయాదవ్, కంచరాన చిన్నబాబు, దువ్వాడ మధుకేశ్వరరావు, దువ్వాడ రవి, పినకాన ముకుంద, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# పేదల గుండెల్లో చిరస్మరణీయుడు వైఎస్ఆర్

**-మాజీ చైర్మన్ బల్ల గిరిబాబు**

**-సంత మైదానంలో వైఎస్ఆర్ విగ్రహానికి ఘన నివాళి**

**-జోహార్ వైఎస్ఆర్ నినాదాలతో మార్మోగిన పలాస**



**పలాస, సెప్టెంబరు 2 (వార్త):** దివంగత మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, పేదల పెన్నిధి, రైతు బాంధవుడు, ప్రజా హృదయ నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని సంత మైదానంలో ఉన్న రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ బల్ల గిరిబాబు ఆధ్వర్యంలో బుధవారం ఉదయం అత్యంత భావోద్వేగభరిత వాతావరణంలో ఘనంగా పూలమాలలు వేసి, పూల వర్షం కురిపించి, జోహార్ వైఎస్ఆర్, రాజన్న అమర్ హై అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నివాళులర్పించడం చేపట్టారు. వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా బల్ల గిరిబాబు మాట్లాడుతూ ఈ రాష్ట్రానికి ఆయన చేసిన సేవలు, అందించిన సంక్షేమ పాలన, తీసుకువచ్చిన అభివృద్ధి చరిత్రలో ఎన్నటికీ చెరగని సంతకమని, ఆయన ఒక వ్యక్తి కాదు, ఒక శకం, ఒక చరిత్ర, ఒక విధానం, ఒక విప్లవమని, ముఖ్యంగా జలయజ్ఞం ద్వారా రైతాంగానికి చేసిన సేవలు మరువలేనివని, వేల కోట్ల రూపాయలతో భారీ సాగునీటి ప్రాజెక్టులు కట్టించి, ఎండిన పొలాలకు, బీడు భూములకు నీళ్లు తెచ్చి, రైతన్న కళ్ళలో ఆనందం నింపి, రైతే రాజు అని నిరూపించిన రైతు బాంధవుడు, రైతులకు అండగా నిలిచిన నిజమైన నాయకుడు వైఎస్ఆర్ అని అన్నారు, ఫీజు రీయింబర్స్ మెంట్ పథకం ద్వారా ఆర్థిక స్తోమత లేక ఉన్నత విద్యకు దూరమవుతున్న పేద, మధ్యతరగతి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ యువకులకు ఇంజనీరింగ్, మెడిసిన్, డిగ్రీ వంటి ఉన్నత విద్య చదువుకునే అవకాశం కల్పించి, వారి కలలను నిజం చేసి, వారిని డాక్టర్లు, ఇంజనీర్లు, సాఫ్ట్ వేర్ ఉద్యోగులుగా తీర్చిదిద్దిన విద్యా ప్రదాత, సరస్వతీ పుత్రుల ఆరాధ్య దైవం ఆయన అని, అదేవిధంగా రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేద ప్రజలకు కార్పొరేట్ హాస్పిటల్ లో గుండె, కిడ్నీ, క్యాన్సర్, బ్రెయిన్ వంటి ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా, రూ.2 లక్షల వరకు చేయించి లక్షలాది మంది పేదల ప్రాణాలు కాపాడిన ప్రాణదాత, ప్రజా వైద్యుడు ఆయన అని కొనియాడారు, ఇలాంటి ఎన్నెన్నో బృహత్తర కార్యక్రమాలు చేసి, ప్రజల కష్టాలు తెలుసుకోవడానికి పాదయాత్ర చేసి అధికారంలోకి వచ్చి వాటిని తీర్చిన నాయకుడు వైఎస్ఆర్ అని, 108 అంబులెన్స్ పెట్టి ఆపదలో ఉన్న వారికి, రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి ప్రథమ చికిత్స చేయించి దగ్గర్లో ఉన్న వైద్యశాలలకు పది నిమిషాలలో పేషెంట్లను చేర్పించే అద్భుత వ్యవస్థను, అలాగే 104 సంచార వైద్య సేవలను తీసుకువచ్చి గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు సైతం వైద్యాన్ని చేర్చి ప్రజల మనసుల్లో చిరస్మరణీయుడుగా, చెరగని ముద్రగా నిలిచిన నాయకుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని చెప్పక తప్పదని అన్నారు, రాజశేఖర్ రెడ్డి అనే పేరు వింటే ప్రతి గ్రామంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు, కిలో రెండు రూపాయలకు బియ్యం, వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు నెలనెలా పింఛన్లు, పావలా వడ్డీ, అభయహస్తం, చేనేత కార్మికులకు, మత్స్యకారులకు చేయూత, మహిళలకు, యువతకు అండ వంటి పథకాలే గుర్తుకు వస్తాయని, ఆంధ్ర రాష్ట్ర రాజకీయాలలో ప్రజల గుండెల్లో ఏ రాజకీయ నాయకునికీ లేని స్థానాన్ని, అభిమానాన్ని, ఆత్మీయతను రాజశేఖర్ రెడ్డి సంపాదించుకున్నారని, ఆయన హెలికాప్టర్ ప్రమాదంలో అకాల మరణం చెందిన తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 650 మంది ఆయన అభిమానులు, పేద ప్రజలు గుండెలు ఆగి మరణించారంటే, గుండెపోటుతో చనిపోయారంటే రాజశేఖర్ రెడ్డిని ప్రజలు ఎంత అభిమాన నాయకుడిగా, కుటుంబ పెద్దగా, ఇంటి దీపంగా చూశారో, ఆయన మరణాన్ని వారు ఎంతగా తట్టుకోలేకపోయారో మనందరికీ తెలిసిన విషయమేనని, అలాంటి మహానేత ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, ఆయన చూపిన బాటలోనే నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ నేతలు మద్దు రాంప్రసాద్, రెడ్డి వైకుంఠ రావు, డబ్బిరు నాగు, ప్రసాద్, వల్లభ వైకుంఠరావు, రోనంకి వెంకటరమణ తోపాటు వైఎస్ఆర్సీపీ అభిమానులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాలతో..

# పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు

**పలాసలో జనసేన ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ**

**- మెగా రక్తదాన శిబిరం**

**పలాస, సెప్టెంబరు 2 (వార్త):** జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని పలాసలో జనసేన నాయకులు, జనసైనికులు బుధవారం ఘనంగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ దుర్గారావు ఆధ్వర్యంలో పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో జనసైనికులు పాల్గొని పవన్ కల్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాజీ మున్సిపల్ చైర్మన్, జనసేన నాయకుడు కోత పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. జనసైనికులు స్వచ్ఛందంగా రక్తదానం చేయగా సుమారు 50 యూనిట్ల రక్తాన్ని సేకరించి స్థానిక బ్లడ్ బ్యాంకుకు అందజేశారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ద్వారా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం ఆనందంగా ఉందని నాయకులు తెలిపారు.

## వీర మహిళలతో కలిసి కేక్ కట్

అనంతరం జనసేన వీర మహిళలతో కలిసి కేక్ కట్ చేసి జనసైనికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు పవన్ కల్యాణ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. టీకేఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జనసేన యువజన విభాగం లోగో ఆవిష్కరణ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. జన్మదిన వేడుకలకు సేవా కార్యక్రమాలను జోడిస్తూ బైక్ ర్యాలీ, రక్తదాన శిబిరం నిర్వహించడం ద్వారా పవన్ కల్యాణ్‌పై తమ అభిమానాన్ని జనసేన నాయకులు, కార్యకర్తలు చాటుకున్నారు. ఈ కార్యక్రమాల్లో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ పాండా, కుప్పల గోపాల్, కిల్లి బాలకృష్ణ, మజ్జి భాస్కర్, అట్టాడ వాసు, పైలా నాగార్జున, తుంగాన దేవరాజు, మెడిశెట్టి నరసింహమూర్తి, నందిగాం ధర్మారావు, హరీష్ కుమార్ శ్రీకాంత్, కోన కృష్ణారావు, శంఖు శ్రీకాంత్, బంగారు కేదార్, దీన పత్రో, ఉదయగిరి అశోక్ గోపాల్, తాడి తరాలు తదితరులు పాల్గొన్నారు.




# వైఎస్సార్ వర్ధంతికి వెల్లువెత్తిన అభిమానం

**- రాజన్న సేవలను స్మరించుకున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు..**

**- భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు**

**కొత్తూరు, సెప్టెంబరు 2 (వార్త):** మహానేత, దివంగత ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖరరెడ్డి వర్ధంతి వేడుకలు కొత్తూరు పంచాయతీలో ఘనంగా నిర్వహించారు. కొత్తూరు పంచాయతీలోని రాజన్న విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ముఖ్య అతిథిగా హాజరై వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.

వైఎస్సార్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, పేద ప్రజల కోసం ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు గుర్తు చేసుకున్నారు. రాజన్నను మరచిపోలేమని.. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ శ్రేణులు పేర్కొన్నారు.

వర్ధంతి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు తరలిరావడంతో కొత్తూరు పంచాయతీలో రాజకీయ సందడి నెలకొంది. రాజన్నపై ఉన్న అభిమానం ఏ మాత్రం తగ్గలేదని ఈ కార్యక్రమానికి తరలివచ్చిన జనసందోహం మరోసారి చాటిచెప్పిందని పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి.

## ప్రజలకు స్వయంగా అన్నం వడ్డించిన శాంతి

వర్ధంతి కార్యక్రమం అనంతరం నిర్వహించిన అన్నసంతర్పణలో మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె స్వయంగా ప్రజలకు భోజనాలు వడ్డించారు. నాయకురాలిగా మాత్రమే కాకుండా ప్రజల మధ్య కలిసిమెలిసి కార్యక్రమంలో పాల్గొనడం పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహానేత వైఎస్సార్‌కు ఘన నివాళులు అర్పించారు



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.

Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546